క్లుప్తంగా

సఫాయి కర్మాచారీస్ కమిషన్ సభ్యుడి రాక



సఫాయి కర్మాచారీస్ కమిషన్ సభ్యుడు వావాకు స్వాగతం పలుకుతున్న జిల్లా అధికారులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సఫాయి కర్మాచారీస్ జాతీయ కమిషన్ సభ్యుడు డాక్టర్ పీపీ వావా బుధవారం రాత్రి నగరానికి విచ్చేశారు. గురువారం మధ్యాహ్నం 12 గంటలకు కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో సఫాయి కర్మాచారీస్‌కు జిల్లాలో అమలవుతున్న సంక్షేమ, విద్య, ఆర్థికాభివృద్ధి పథకాల ప్రగతి తీరును ఆయన సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించనున్నారు. నగరానికి విచ్చేసిన వావాకు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కుముదిని సింగ్, సోషల్ వెల్ఫేర్ జాయింట్ డైరెక్టర్ జయ ప్రకాష్ పుష్పగుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు.

పాత కక్షలతో వ్యక్తిపై దాడి

ఏలూరు టౌన్: పెదవేగి మండలం రాయుడిపాలెం గ్రామంలో పాత కక్షల నేపథ్యంలో బుధవారం రాత్రి ఒక వ్యక్తిపై మరో ఇద్దరు దాడి చేశారు. కత్తులతో విచక్షణారహితంగా దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం బాధితుడ్ని ఏలూరు జీజీహెచ్‌కు తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి...రాయుడిపాలెం గ్రామానికి చెందిన పెనుబోయిన రాంబాబు, కొలుసు లక్ష్మణరావు కుటుంబాల మధ్య గత కొంతకాలంగా వ్యక్తిగత తగాదాలు ఉన్నాయి. గతంలో ఇరువర్గాల మధ్య ఏర్పడిన వివాదాలు, గొడవలతో కేసులు పెట్టుకోవడంతో అవికాస్త కోర్టుల్లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి రాంబాబు తన ఇంటి వద్ద మోటారు సైకిల్‌పై దిగుతుండగా లక్ష్మణరావు, మరో వ్యక్తి ఒక్కసారిగా రాంబాబుపై కత్తులతో దాడి చేశారు. దీంతో రాంబాబు తలపై, చెవిపై, కంటి మీద తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడ్ని చికిత్స నిమిత్తం బంధువులు ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం నిందితుడు పరారీలో ఉన్నాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ ప్రధాని వాజ్‌పేయికి ఘన నివాళి

ఏలూరు (టూటౌన్): బీజేపీ శ్రేణులకు మాజీ ప్రధాని వాజ్‌పేయి జీవితం ఆదర్శనీయమని బీజేపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు కొరళ్ళ సుధాకర్ కృష్ణ అన్నారు. మాజీ ప్రధాని వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా స్థానిక వైఎంహెచ్ హాల్ సెంటర్ వద్ద బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు ఘన నివాళులర్పించారు. ఈసందర్భంగా వాజ్‌పేయ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో బీజేపీ నాయకులు గాది రాంబాబు, వులవల సాయి, లక్కోజు అనిల్ ఆచార్య పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు పేదలకు పంచాలని వినతి



భూసమస్యలపై డీఆర్వోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): పేదలు, దళితులు 30 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములకు ప్రభుత్వం హక్కు పత్రాలు ఇవ్వాలని, యాజమాన్య హక్కు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ కోరారు. ప్రభుత్వ భూములు పేదలకు పంచాలని కోరుతూ డీఆర్‌ఓ మూర్తికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ బృందం బుధవారం వినతిపత్రం అందించింది. దెందులూరు మండలం పోతునూరు, దోసపాడు, కొవ్వలి, దెందులూరు గ్రామాల్లో సుమారు 1,500 ఎకరాలు ప్రభుత్వ అసైన్డ్, సీలింగ్, గయాళ్ళ భూములు స్థానిక, స్థానికేతర భూస్వాముల చేతుల్లో ఉన్నాయన్నారు. దీనిపై గతేడాదిగా పేదలు పోరాటం చేస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.

పేదింటి క్రీడా కుసుమాలకు చేయూత

- నేనున్నానంటూ అండగా నిలిచిన ఎమ్మెల్యే నాని
- చదరంగంలో అత్యుత్తమ శిక్షణకు రూ.లక్ష ఆర్థిక సాయం



గడపగడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే నానికి సాధించిన పతకాలను చూపిస్తున్న చదరంగం క్రీడాకారిణులు



ఏలూరు పార్టీ కార్యాలయం వద్ద క్రీడాకారిణులకు రూ.లక్ష అందజేస్తున్న మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ డి.వరప్రసాద్, జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

ఏలూరు టౌన్: పేదింటి క్రీడాకుసుమాలకు నేనున్నానంటూ ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ళనాని అండగా నిలిచారు. చదరంగం క్రీడాకారిణులుగా మరింత ఉన్నత స్థానాలకు చేరుకునేందుకు తనవంతు సహాయం అందించేందుకు ముందుకు వచ్చారు. అత్యుత్తమ శిక్షణ తీసుకుని భవిష్యత్తులో ఉన్నతస్థితికి చేరుకుని, భావితరాలకు స్ఫూర్తిగా నిలవాలనే ఆకాంక్షతో ఆర్థికంగా దన్నుగా నిలిచారు ఎమ్మెల్యే నాని.

చదరంగంలో విజేతలు

ఏలూరు 43వ డివిజన్‌కు చెందిన పచ్చల సుకుమార్, విజయలక్ష్మి దంపతుల పెద్ద కుమార్తె పచ్చల సుచిత్ర క్రిస్టీ (8వ తరగతి), చిన్న కుమార్తె పచ్చల బబ్లీబాల (7వ తరగతి) చదువుతున్నారు. వీరిద్దరూ చదరంగంలో ప్రావీణ్యం సంపాదించారు. చిన్ననాటి నుంచి చదరంగంలో నైపుణ్యాన్ని సాధించి విజయపరంపర కొనసాగిస్తున్నారు. సుచిత్ర క్రిస్టీ జిల్లాస్థాయిలో 7సార్లు మొదటిస్థానం, రాష్ట్రస్థాయి టాప్‌టెన్‌లో అనేకమార్లు స్థానం సాధించింది. బబ్లీబాల జిల్లా స్థాయిలో మూడు సార్లు ప్రథమస్థానంలో నిలిచింది. ప్రస్తుతం క్రిస్టీ జాతీయస్థాయి పోటీలకు, బబ్లీబాల రాష్ట్రస్థాయి పోటీలకు సన్నద్ధమవుతున్నారు.

గడపగడపకు కార్యక్రమంలో..

ఎమ్మెల్యే ఆళ్ళనాని 43వ డివిజన్‌లో మే 15న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి హాజరైన సందర్భంలో చదరంగంలో రాణిస్తున్న అక్కాచెల్లెళ్ళ ప్రతిభను ఆయనకు వివరించారు. జాతీయస్థాయి పోటీలకు సన్నద్ధం కావాలనే ఆకాంక్షను వారు తెలియజేశారు. చదరంగం అత్యుత్తమ శిక్షణ వ్యయప్రయాసలతో కూడినదని, తమ బిడ్డల భవిష్యత్తుకు చేయూత అందించాలని తల్లిదండ్రులు కోరారు. ఉత్తమ శిక్షణ తీసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎమ్మెల్యే నాని ఆకాంక్షించారు.

రూ.లక్ష సాయం అందజేత

ఏలూరు ఆర్ఆర్‌పేటలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం స్వాతంత్ర దినోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఈవేడుకల్లో చదరంగం క్రీడాకారిణులైన క్రిస్టీ, బబ్లీబాలలుకు ఇచ్చిన హామీని నెరవేర్చాలనే ఉద్దేశ్యంతో ఎమ్మెల్యే ఆళ్ళనాని రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని అందజేశారు. రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ దిరిశాల వరప్రసాద్, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి, తదితరుల చేతులమీదుగా వారికి ఆర్థిక సాయం అందజేశారు.

తమ కుమార్తెల ఉజ్వల భవిష్యత్తుకు ఎమ్మెల్యే ఆళ్ళనాని సహాయం అందించడంపై తల్లిదండులు సంతోషం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే నాని స్ఫూర్తితో జాతీయస్థాయిలో పతకాలు సాధిస్తామని క్రీడాకారిణిలు క్రిస్టీ, బబ్లీ తెలిపారు.

మేతర అజయ్‌కు సేవారత్న పురస్కారం



స్వాతంత్య్ర వేడుకల్లో ప్రశంసా పత్రం అందుకుంటున్న మేతర అజయ్ బాబు

ఏలూరు (టూటౌన్): మానవత సంస్థ అధ్యక్షుడు, సంఘ సేవకుడు మేతర అజయ్ బాబుకు ప్రభుత్వం సేవారత్న పురస్కారాన్ని అందించింది. ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో మంగళవారం నిర్వహించిన స్వాతంత్య్ర వేడుకల్లో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పినిపే విశ్వరూప్ చేతుల మీదుగా అజయ్ బాబు ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు.ఈ సందర్భంగా అజయ్ బాబు మాట్లాడుతూ ఈ పురస్కారంతో మరింత ఉత్సాహంతో సేవా కార్యక్రమాల్లో పాల్గొంటానని తెలియజేసారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఎస్పీ మేరీ ప్రశాంతి, జేసీ బి.లావణ్య వేణికు ఆయన కృతజ్ఞతలు తెలియజేసారు.

బీసీ ఉద్యోగుల సంఘ నేత విఠల్‌కుమార్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న ఎస్‌పీఆర్ విఠల్‌కుమార్

ఏలూరు (టూటౌన్): బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఉద్యోగుల జేఏసీ వైస్ చైర్మన్, ఏపీ గృహ నిర్మాణ సంస్థ అసిస్టెంట్ మేనేజర్ ఎస్‌పీఆర్ విఠల్ కుమార్ మంగళవారం విజయవాడలో నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో ప్రతిభా అవార్డును అందుకున్నారు. గృహనిర్మాణ శాఖ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీ షా చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. విఠల్ కుమార్‌కు గృహనిర్మాణ సంస్థ సిబ్బంది, బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు అభినందించారు.

అల్లూరి సీతారామరాజు పోరాటం స్ఫూర్తిదాయకం



కళానీరాజనం కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ

ఏలూరు (టూటౌన్): దేశ ప్రజల సంపదను దోపిడీ నుంచి కాపాడేందుకు అల్లూరి సీతారామరాజు పోరాటం నుంచి స్ఫూర్తి పొందాలని ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ అన్నారు. స్థానిక కోటదిబ్బలోని సీతారాం భర్తియా కళ్యాణమండపం నందు 77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంగళవారం రాత్రి కళానీరాజనం కార్యక్రమాన్ని ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించారు. సభకు వై.ఆనందనాయుడు అధ్యక్షత వహించగా, విజ్ఞాన కేంద్రం నిర్వాహక కమిటీ సభ్యురాలు జి.శారద స్వాగతం పలికారు. ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ ఏలూరు పరిసర ప్రాంతాల స్కూళ్లు, కాలేజీల్లో వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ పోటీల్లో వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. కళానీరాజనంలో పాటలు పాడిన హేలాపురి సింగర్స్ అసోసియేషన్ గాయకులకు, అభ్యుదయ గీతాలకు నృత్యాలు, కోలాటం ప్రదర్శించిన సాంస్కృతిక బృందాలకు అభినందనలు తెలియజేసారు. ఈ సందర్భంగా ప్రదర్శించినపలు ప్రదర్శనలు, నృత్యాలు ఆహుతులను అలరించాయి. వివిధ పోటీల్లో విజేతలు 120 మందికి ఎమ్మెల్సీ సాబ్జీ చేతుల మీదుగా జ్ఞాపికలు అందజేసారు. ఈ కార్యక్రమంలో ఆలపాటి నాగేశ్వరరావు, వీజీఎంవీఆర్ కృష్ణారావు, ఎస్‌వీ సుబ్రహ్మణ్యం, కేఎస్‌కే సత్యనారాయణ, పీడీ రత్నాకరరావు, ఎస్ కస్తూరిరావు, వి.సురేష్, పి.ఆంజనేయులు, మేతర అజయ్‌బాబు, ఎన్.గంగాభవానీ పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు డిపాజిట్లు చెల్లించాలి

ఏలూరు (టూటౌన్): అగ్రిగోల్డ్ బాధితులకు ఇచ్చిన హామీ మేరకు డిపాజిట్లు చెల్లించాలని ఏలూరు జిల్లా అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి యర్రా వెంకటేశ్వరరావు కోరారు. స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం బండి వెంకటేశ్వరరావు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా యర్రా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర అసోసియేషన్ నిర్ణయాలను అమలు చేసే క్రమంలో ఈ నెల 27న ఏలూరులో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏలూరు జిల్లా నాయకులు చెక్క జగన్, ఏవి రాంబాబు, బి.రామకృష్ణ, ఎస్ సూర్యనారాయణ, ఎం.నారాయణ రావు, జి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

18వ డివిజన్‌లో అభివృద్ధి పనుల పరిశీలన



ఏలూరు 18వ డివిజన్‌లో సీసీ రోడ్డు పనులను పర్యవేక్షిస్తున్న ఇనపనూరి జగదీష్

ఏలూరు టౌన్: ఏలూరు వన్‌టౌన్ 18వ డివిజన్‌లో పలు అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయి. ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ళనాని ప్రత్యేక శ్రద్ధతో డివిజన్‌లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేశారు. 18వ డివిజన్‌లోని రాజీవ్ గృహకల్ప కాలనీ, వంగాయగూడెం పరిసర ప్రాంతాల్లో అభివృద్ధి పనులు ప్రారంభించారు. రూ.40లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయినేజీ, కల్వర్టుల నిర్మాణాలకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ అభివృద్ధి పనులను 18వ డివిజన్ కార్పొరేటర్ ఇనపనూరి కేదారేశ్వరి, వైఎస్సార్ సీపీ నాయకులు, డివిజన్ ఇన్‌ఛార్జ్ ఇనపనూరి జగదీష్ క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. ఎమ్మెల్యే నాని ఆదేశాలతో అభివృద్ధి పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టేలా అధికారులు, సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ పనులు చేయిస్తున్నట్లు వారు తెలిపారు.

అగ్నిప్రమాద బాధితుడికి పరామర్శ



ఏలూరు జీజీహెచ్‌లో బాధితుడ్ని పరామర్శిస్తున్న డాక్టర్ దిరిశాల వరప్రసాద్, డిప్యూటీ మేయర్ సుధీర్, ఏఎంసీ వైస్ చైర్మన్ రామకృష్ణ

ఏలూరు టౌన్: పోణంగి కొత్త దళితవాడలో బుధవారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ అగ్నిప్రమాదంలో పరసే డేవిడ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతడ్ని ఏలూరు జీజీహెచ్‌కు తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ళనాని ఆదేశాల మేరకు రాష్ట్ర మెడికల్, ఫార్మసీ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ దిరిశాల వరప్రసాదరావు, ఏలూరు డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ కంచన రామకృష్ణ, కార్పొరేటర్ దారపు తేజ హాస్పిటల్‌లో వైద్య చికిత్స పొందుతున్న అగ్నిప్రమాద బాధితుడు డేవిడ్‌ను పరామర్శించారు. బాధితునికి మెరుగైన వైద్య చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పరంగా సాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఏలూరు తహసీల్దార్ సోమశేఖర్‌కు సూచించారు. బాధితులకు అండగా ఉంటామని భరోసా కల్పించారు.

శ్రీపర్రు గ్రామస్తులను ఆదుకోండి

ఏలూరు రూరల్: ఏళ్ల తరబడి సాగు భూములు లేక అవస్థలు పడుతున్న గ్రామస్తులను ఆదుకోవాలని శ్రీపర్రు పెద్దలు ఏలూరు ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజును కోరారు. బుధవారం శ్రీపర్రు గ్రామానికి చెందిన వడ్డి కార్పొరేషన్ డైరక్టర్ మండల కొండలరావు, వైసీపీ నాయకులు సైదు వజ్రంతో పాటు పలువురు పెద్దలు ఎంపీపీని కలిసారు. ఈ సందర్భంగా కొండలరావు మాట్లాడుతూ కొల్లేరు ప్రక్షాళన తర్వాత శ్రీపర్రు గ్రామస్తులకు ఉపాధి కరువై ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిపోయారని గుర్తు చేసారు. నాటి ప్రభుత్వం కొల్లేరులో అనేక గ్రామాలకు ప్రభుత్వ భూములు పంపిణీ చేసినప్పటికీ శ్రీపర్రు గ్రామస్తులకు ఒక్క సెంటు భూమి మంజూరు చేయలేదన్నారు. కొల్లేరులో ప్రభుత్వ మిగులు భూములు గుర్తించి శ్రీపర్రు పేదలకు అందేలా కృషి చేయాలని ఎంపీపీని కోరారు. దీనిపై స్పందించిన శ్రీనివాసరాజు కొల్లేరులో భూమి లేని పేదల స్థితిగతులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, భూములు అందేలా ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కృషి చేస్తున్నారని వివరించారు. సమస్యను మరో సారి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాలని గ్రామస్తులు సూచించారు.

శశిధర్ రెడ్డికి ఘన నివాళి

ఏలూరు (టూటౌన్): ఏలూరు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, పోక్సో కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ తేతలి శశిధర్ రెడ్డికి ఏలూరుకు చెందిన పలువురు న్యాయవాదులు ఘన నివాళులర్పించారు. శశిధర్ రెడ్డి సంస్మరణ కార్యక్రమంలో పెనుమంట్ర మండలం బ్రాహ్మణ చెరువులో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏపీపీలు, న్యాయవాదులు హాజరయ్యారు. ఏలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్బినేని విజయ్ కుమార్, పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూ టర్ కోనే సీతారామారావు, ప్రభుత్వ ప్లీడర్ బి.జగన్నాథరెడ్డి, ఐదో అదనపు జిల్లా కోర్టు, మహిళాకోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డీవీ రామాంజనేయులు, ఏలూరు మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ ప్రత్తిపాటి తంబి, సీనియర్ న్యాయవాది ఏవీ నారాయణ పాల్గొన్నారు.

నేతన్నలకు అండగా ప్రభుత్వం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): చేనేత కళాకారులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని, ఏటా వారికి రూ. 24 వేల ఆర్థిక సహాయం అందిస్తోందని ఏలూరు నగర పాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు తెలిపారు. స్థానిక టీటీడీ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన చేనేత, హస్తకళా ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత చేనేత కళాకారులకు ఆదరణ లభిస్తోందన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అందే సింహాద్రి, బట్టు సురేష్ మాట్లాడుతూ ఈ ప్రదర్శన ఈ సెప్టెంబర్ 3వ తేదీ వరకూ కొనసాగుతుందని తెలిపారు. దాదాపు 60 ప్రాంతాల నుంచి వచ్చిన చేనేత కళాకారులు తాము రూపొందించిన వస్త్రాలను ఉత్పత్తి ధరలకే నగర ప్రజలకు అందించడానికి తమ ప్రదర్శనను వేదికగా చేసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కలవకొల్లు సాంబ, పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

బోరగం ఫౌండేషన్ సేవలు అభినందనీయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలోని గిరిజన ప్రాంతాల ప్రజలను ఆదుకోవడానికి బోరగం ఫౌండేషన్ సంస్థ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని, వాటిని విస్తృతంగా కొనసాగించాలని రాజ్యసభ సభ్యుడు వీ. విజయసాయి రెడ్డి ఆ సంస్థ సీఈఓకు సూచించారు. ఇందుకు సంబంధించిన వివరాలను బోరగం ఫౌండేషన్ సీఈఓ బోరగం దుర్గా ప్రసాద్ దొర ఏలూరులో తెలియజేశారు. మంగళవారం అమరావతిలోని విజయసాయి రెడ్డి కార్యాలయంలో ఆయనను కలిశామని, ఆయనతో పాటు ఎంపీ నందిగం సురేష్‌ను కూడా కలిసి తమ ఫౌండేషన్ ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలను వివరించామని బోరగం దుర్గా ప్రసాద్ దొర తెలిపారు. తమ సంస్థ సామాజిక బాధ్యతతో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను వారు అభినందించారని బోరగం దుర్గా ప్రసాద్ దొర తెలిపారు.

దుర్గమ్మ హుండీ ఆదాయం రూ.1.75 లక్షలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక పత్తేబాదలోని నాలుగు గుడుల సెంటర్‌లో వేంచేసియున్న శ్రీ కనకదుర్గ అమ్మ వారి ఆలయంలో బుధవారం అమ్మవారి హుండీ ఆదాయం లెక్కించారు. ఈ లెక్కింపులో అమ్మవారికి హుండీల ద్వారా రూ. 1,75,944 ఆదాయం సమకూరింది. ఈ ఆదాయం 154 రోజులకు వచ్చిందని ఆలయ కార్యనిర్వహణాధికారి డీ. శంకరరావు తెలిపారు. నగరంలోని రంగ్రీజులు మఠం గ్రూప్ దేవస్థానాల కార్యనిర్వహణాధికారి సీహెచ్ చిన నాగేశ్వరరావు పర్యవేక్షణలో నిర్వహించిన ఈ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ బీహెచర్ రామనాగ శంకర్, ట్రస్టీలు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా .. ప్రయాణికులకు గాయాలు

ఏలూరు టౌన్: ఏలూరు నగర శివారులో బుధవారం ఆటో అదుపుతప్పి బోల్తా కొట్టడంతో ప్రయాణికులకు గాయాలయ్యాయి. ఏలూరు నగరం నుంచి చెక్కపల్లి ప్రాంతానికి ముగ్గురు ప్రయాణికులతో ఆటో బయలుదేరింది. ఇద్దరు మహిళలు, పురుషుడు ఉండగా డ్రైవర్ ఆటోను నడుపుతున్నాడు. ఆటో ఏలూరు శివారు రవాణాశాఖ కార్యాలయం సమీపానికి చేరుకునే సరికి అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన డ్రైవర్‌ను ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే భారీ జరిమానా

ఏలూరు టౌన్: ఏలూరులో మద్యం తాగి ఇష్టారాజ్యంగా వాహనాలు నడిపితే భారీ మూల్యం తప్పదని పోలీసులు హెచ్చరిస్తున్నారు. మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి న్యాయస్థానం రూ.10వేలు జరిమానా విధించటం విశేషం. ఈ నేపథ్యంలో మద్యంతాగి మోటారు సైకిళ్లు నడపటం మానుకోవాలని ఏలూరు వన్‌టౌన్ సీఐ ఎస్.రాజశేఖర్ సూచించారు. ప్రభుత్వ నిబంధనలు మేరకు మోటారు సైకిళ్ల యజమానులు డ్రైవింగ్ లైసెన్సు, వాహన రిజిస్ట్రేషన్ పత్రాలు కలిగి ఉండాలని తెలిపారు. సీఐ రాజశేఖర్ వన్‌టౌన్ ప్రాంతంలో వాహన తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించగా ఐదుగురు మద్యం సేవించి వాహనాలు నడిపినట్లు గుర్తించారు. వారిని బుధవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఒక్కొక్కరికీ రూ.10వేలు జరిమానా విధించినట్లు తెలిపారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పోరాటం

ఏలూరు (టూటౌన్): విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు, ఎనర్జీ అసిస్టెంట్లు సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం నిర్వహించనున్నట్లు ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ జిల్లా చైర్మన్ జె.శ్రీనివాస్ స్పష్టం చేశారు. పవర్ జేఏసీ చేసిన ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 17న కార్మిక శాఖ అధికారులకు లేఖలు ఇవ్వనున్నట్లు తెలిపారు. స్థానిక సిఐటీయూ జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ మాట్లాడుతూ ఈనెల 17న నిర్వహించనున్న విద్యుత్ సౌధ ధర్నా వాయిదా వేసినా జిల్లాలో పోలీసులు ఉద్యోగులను తీవ్రంగా వేధిస్తున్నారన్నారు. ఉద్యోగుల ఇళ్లకు వచ్చి నోటీసులు ఇస్తున్నారని అన్నారు. ప్రభుత్వం విద్యుత్ ఉద్యోగుల న్యాయమైన సమస్యలపై స్పందించి పరిష్కరించాలని ఆయన కోరారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	38
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	38
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	38
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	35

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	18
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	15
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	03
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	21
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	27
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	38
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	08.00	4794	రద్దు
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	32
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	రద్దు
ఏలూరు -తిరుపతి	16.00	4830	25